'రాజ్యం ప్రతిభ'

శ్రీమతి దే. జయలక్ష్మి

సూర్యోదయమింకా సరిగ్గా కాకముందే యా'వార్త' యూరంతయు పొక్కిపోయింది. జనులు గుంపులు గుంపులుగా నారాయణరావుగారి గృహము చెంతకు పరిగిడుచుండిరి. అందరాశ్చర్యముతో జరిగిన ఘోరమునుగూర్చి "ఇదెవ్వరుచేసిరి? ఎట్లుచేసిరి? ఎప్పుడుచేసిరి?" అని యొకరినొకరు ప్రశ్నించుకొనుచు యాఘోర దృశ్యమును కాంచు కుతూహలముతో నొకరికంటే నొకరు ముందుగా వారియిల్లు సమీపించుచుండిరి.

'ఏమాఘోరము?' 'హత్య.' పదునారేండ్ల జవ్వనియగు 'శకుంతల' 'హత్య' గావింపబడినది. ఆ జన ప్రవాహమును త్రోసికొనుచు నలుగురు రక్షకభటులును, పోలీసు యినస్పెక్టరును వెంటరా పత్తేదారు 'ప్రకాశరావు' హడావుడిగా ప్రవేశించెను. పత్తేదారుని కాంచగనే, నారాయణరావుగారొక్క పెట్టున బిట్టుగా విలపించిరి. ఆయన దుఃఖము కాంచగనే ప్రకాశరావుగారికికూడ కండ్లవెంబడి నీరువచ్చెను. ఆయన తన కండ్లనీరు కరవస్త్ర సాయమున తుడుచుకొనుచు శకుంతల గదిచెంతకు నడచెను.

శకుంతల తన గదియందుగల మంచముమీదనే పరుండియుండెను. ఆమె హృదయమునందొక 'బాకు' గ్రుచ్చబడి యుండెను. ప్రక్కనే యొక కరవస్త్రముగూడ బడియుండెను. ప్రక్కనేగల యొక మేజామీద కొన్ని పుస్తకములు, కలము, సిరాబుడ్డి మొదలగునవన్నియుకలవు. డిటెక్టివ్ ప్రకాష్ అంతయు పరిశీలించి నారాయణరావుగారున్న గదిలోనికివచ్చెను. ఆయనయు ప్రకాశరావుగారిని, పోలీసు యినస్పెక్టర్ ప్రసాదరావుగారినికూడా కూర్చుండబెట్టెను. అంత ప్రకాశరావు నారాయణరావుగారితో "అయ్యా! నేనడుగు ప్రశ్నలకు ముందు జవాబు చెప్పు"డనెను.

నారాయణ:—అడుగునాయనా! తెలిసినంతవరకు జెప్పెదను.

ప్రకాష్:—ఆమె రాత్రి యెన్ని గంటలకు శయనించినది?

నారాయణ:—షుమారు తొమ్మిది గంటలకు.

ప్రకాష్:—తరువాత మీకేవిధమయిన శబ్దముకానీ వినబడినదా?

నారాయణ:—లేదు. రెండుగంటల కాలమున సీతయ్యకు శకుంతల గదిలో నేదో యలికిడి వినిపించినది.

ప్రకాష్:—ఆ సంగతి నాతడెవరితో చెప్పెను?

నారాయణ:—రాజారావు బయటికి వచ్చినప్పుడు చెప్పెను.

ప్రకాష్:—మీరీదృశ్యము నెపుడు కాంచితిరి?

నారాయణ:—మూడుగంటల కాలమున.

ఇంక నాతడిట్లందరినీ ప్రశ్నించి ప్రసాదరావుతో యేదో మాట్లాడెను. ఆయనయు నారాయణ గారితో "ఆమెకెవ్వరూ శత్రువులులేరుగదా!" అనెను. 'లేరు' అని ఆయన జవాబిచ్చెను. ఈ విధముగ వారిద్దరు ప్రసంగించుకొనుచు తమ గృహములకేగిరి.

శకుంతల నారాయణరావుగారి ఏకపుత్రిక. నారాయణరావుగారు గొప్పధనవంతులు. పేరుగల న్యాయవాదులు. శకుంతల చిన్నతనముననే తల్లిని కోల్పోయి మేనత్తయగు రుక్మిణమ్మగారి పెంపకముననే పెరిగెను. రుక్మిణమ్మగారికి రాజారావను కుమారుడుకలడు. తండ్రి లేనందువలన రాజారావు మేనమామ యింటియందేయుండి చదువుకొనుచుండెను. అతడిరువది సంవత్సరముల యువకుడు.

పత్తేదారు ప్రకాశరావు తన యింటికివచ్చి యాహత్యా విషయమై యాలోచించుచుండెను. ఇంతలో యాతని ధర్మపత్నియగు 'రాజ్యలక్ష్మి' హడావుడిగా ప్రవేశించి 'ఏమండీ మన శకుంతల నెవరో హత్యగావించిరట. ఎవరట్లు గావించిరి? ఎప్పుడు? చెప్పండీ త్వరగా?' అని యాతనిమీద ప్రశ్నల వర్షము కురిపింపసాగెను. అతడు నవ్వుతూ రాజ్యం! అంత తొందరెందుకు? శకుంతల నెవరో హత్య గావించినది నిజమే. ఎవరు చేశారో అప్పుడే ఎల్లా తెలుస్తుంది? రాత్రే హత్యజరిగిందని నిదానముగా ఆమె ప్రశ్నలకు జవాబులిచ్చెను. ఆమె యాసమాధానములతో తృప్తిపడక 'సరే భోజనానికి లేవండి' అంటూ లోపలికెళ్ళిపోయెను. ప్రకాశరావును ఆమెవెంట లోపలికెళ్ళెను.

రాజ్యలక్ష్మి ప్రకాశరావున కనుకూలపు టిల్లాలు. చిన్నప్పటినుండియు బ స్త్రీలలోయుండి యస్. యస్. యల్. సి. పరీక్షలో నుత్తీర్ణురాలై ప్రకాశరావును ఏరికోరి పెండ్లిజేసికొనెను. ఆమెకు తాను గూడ తన భర్తవలెనే అపరాధులను పట్టవలెనన్న నమిత యుత్సాహము. ప్రకాశరావుగూడ అందుకుతగిన ప్రోత్సాహమిచ్చుచుండును. శకుంతల, రాజ్యలక్ష్ములు ప్రాణస్నేహితురాండ్రు. ఒకరియిండ్లకొకరు తరుచుగా వచ్చుచూ పోవుచూ యుండిరి. ప్రాణస్నేహితురాలి హత్యకు రాజ్య మెంతయో దుఃఖించెను.

శకుంతలహత్యజరిగి దాదాపు పదిహేను దినములయ్యెను. ఒకనాడు సాయంకాలము ప్రకాశరావు సంతసమున యింటికివచ్చి 'రాజ్యం!' అని పిలచెను. రాజ్యలక్ష్మియు 'ఎందుకండీ పిలిచారు?' అనుచూ అచ్చటకొచ్చి యొక కుర్చీమీద కూర్చుండెను. ప్రకాశరావును యొక సోఫామీద కూర్చుండి 'రాజ్యం! శకుంతలా హంతకుడు నేటికి దొరికాడు. ఇంత సులభంగా దొరకుతాడనుకోలేదుసుమా!' అనెను. అంత రాజ్యం అత్యాతురతతో 'ఎవరు?' అనెను. ప్రకాష్ 'ఇంకెవ్వరు? వారియింటి సేవకుడు సీతయ్యాయే హంతకుడు.' రాజ్యం 'ఎట్లు?' 'ఎట్లేమిటి? వాడు పేదవాడు. రాత్రిపూట నారాయణగారి గృహము ననే పడుకొనును. శకుంతల శరీరము ననేకాభరణములుకలవు. వాని నెట్లైనా అపహరింపదలచెను. వాడామెగది ప్రవేశించుసరికి శకుంతలకు మెలకువకలిగెను. వెంటనే యాతడామె మొఖముమీదకు తన చేరుమాలను విసరెను. ఆమె స్మృతిలేకుండా పడిపోయెను. అంతవాడు భయపడి తన చేతియందుగల బాకుచే ఆమెను చంపెను. వెంటనే రాజారావు లేచిన శబ్దముకాగా గుట్టుచక్కగాపోయి పడుకొని రాజారావుతో శకుంతల గదియందేదో శబ్దము వినపడినదని చెప్పెను. అందరూ లేచిచూచిరి. ఆ అర్ధరాత్రి సమయమున వీడికి మెలకువ వచ్చుటకు కారణమేమి? అందరూ అనుమాన పడుదురేమోయని తానుగూడ విచారము నటించెను. అంతేకాదు. ఆ'బాకు' మీద నాతని పేరు 'సీతయ్య'యను నక్షరములుకలవు. ఆ కరవస్త్రము శకుంతలదే. "ఆమెదెట్లో దొంగిలించి యీ కృత్యమొనర్చినాడు తెలిసిందా? ఇంకా విపులం జెయ్యాలా?' అని పత్తేదార్నన్ని విషయములు రాజ్యలక్ష్మితో చెప్పెను.

రాజ్యలక్ష్మి కొంత ఆలోచించి 'ఏమండీ సీతయ్యాయే హంతకుడనుటకు నామనసంగీకరింపకున్నది. అతడు నిర్దోషి. ఇంకొడెవరో యీపనిజేసి యీతనిమీద పెట్టినట్లు నాకు తోచుచున్నది. కాన నేను

మీవాదన యొప్పుకొనను' అనెను. అంత ఆగ్రహముతో రాజ్యంవంక చురచుర జూచుచు ప్రకాశరావు 'రాజ్యం! ఎన్నో నిగూఢమైనట్టియు, అతిభయంకరమయినట్టియు హత్యలెన్నో భేదించినాను. నేనో నరించిన దానినే తప్పనుచున్నావా? నీవు అపరాధ పరిశోధకులమీద అపరాధ పరిశోధ కాధ్యక్షురాలవుగా నున్నావే!' అనెను. అంత రాజ్యం 'ఏమోనండీ! సీతయ్య పెద్దవాడు. అనుభవశాలి. అతడు చిన్నతనము నుండియు శకుంతలను తన చేతులార ఎత్తుకొని పెంచినాడు. ఆమెయనిన యతనికి పుత్రికా ప్రేమకలదు. ఆమెకు కూడ సీతయ్యయన యమిత విశ్వాసము. కాన యీ పనిని యాతడొనర్చియుండడు. ఇంకెవరో చేసియుండ వలెనని నాకు తోచుచున్నది. ఏమంటారు!' అనెను. ప్రకాష్ ఆమెమాటలాలించి 'రాజ్యం! నీ అతి తెలివి తేటలకు నేను అతీగా సంతోషించాను. సరే! నీవు చెప్పినట్లే యొప్పుకొందాము. ఆ యింకొకడెవరో చెప్ప రాదూ? వెళ్ళి బంధించుకొని వస్తాను' అనెను. రాజ్యంలేచి 'ఏమోనండీ డిటక్టీవ్ ఆఫీసర్ గారు మీరే పట్టుకోవాలిగాని, నాకేమి తెలుసు? సీతయ్య విచారణ వాయిదా వేయించండి. ఇదే మన పందెం. చూద్దాం. మీరు గెలుస్తారో. నేను గెలుస్తానో?' అని లోనికి వెళ్ళిపోయెను. ప్రకాష్ ధృఢ నిశ్చయముతో "ఎల్లాగైనా రాజ్యమే యోడిపోతుంది. నేనే గెలుస్తాను." అనుచూ షికారుకై లేచెను.

ఆ మరునాటి సాయంకాలము నాలుగు గంటలకు రాజ్యలక్ష్మి రుక్మిణమ్మగారి నోదార్చుటకై వారి గృహమునకేగెను. రుక్మిణమ్మగారును ఆమెను చూడగనే రమ్మనమని కూర్చుండపెట్టెను. ఇద్దరును శకుంత లనుగూర్చి ముచ్చటించుకొనిరి. అంత రాజ్యలక్ష్మి, రుక్మిణమ్మగారితో శకుంతలకు దినచర్యవ్రాయు నలవాటు కలదనియు నా పుస్తక మెచ్చట కలదనియు నడిగెను. ఆమె తనకావిషయమే తెలియదనియు శకుంతల పుస్తకాల బీరువాలో కలదేమో వెదుకుదుమని చెప్పి తాళపుచెవుల గుత్తిగొనివచ్చి బీరువాను తెరచిచూపెను. అన్ని పుస్తకములను వెదకి ముత్యములబోలు నక్షరములతో నొప్పియున్న డైరీనిచూచి రాజ్యం యుత్సా హంతో తీసికొనెను. పాపం రుక్మిణమ్మగారికి శకుంతలమాట జ్ఞాపకమురాగానే కళ్ళు నీళ్ళతో నిండెను. ఆ సమయమున రాజారావు గదిలోనికి వచ్చెను. రాజ్యలక్ష్మిని, ఆమెచేతియందలి పుస్తకమునుచూచి యాతనిమోము ఆశ్చర్యభరితమయ్యెను. రాజ్యలక్ష్మి అది గ్రహించెను. రాజారావు రాజ్యలక్ష్మితో 'ఏమండీ శకుంతలకు దినచర్యవ్రాయు నలవాటుకలదా? యని ఆశ్చర్యముతో ప్రశ్నించెను.' రాజ్యము 'అవునండీ శకుంతల నాతో చెప్పుచూయుండెడిది తాను దినచర్య వ్రాయుదునని, అందుకని ఆనాడేమైనా ఆమె కనిష్టములగు పనులేవైనా జరిగినవేమోయని చదువుదామని తీసుకెళ్లుచున్నా'ననెను. 'నాకాపుస్తక మివ్వండి చదివి యిస్తాను' అని రాజారావడిగెను. కాని రాజ్యలక్ష్మి "నేను చదువుతా నివ్వాళ. రేపు తెచ్చి యిచ్చెద"నని చెప్పి, యింటికి వెళ్ళెను.

ఆ రాత్రియే రాజ్యం తాను తెచ్చిన పుస్తకమును ఏకాగ్ర చిత్తముతో మొదటినుండియు చివరిదాక జదివెను. అందుగల విషయములన్నియు చదివిన యనంతర మామె ఆశ్చర్య నిమగ్నయయ్యెను. మరునా డామె అలవాటు ప్రకారము రుక్మిణమ్మగారి యింటికివెళ్ళి యింకనూ యితర విషయములెన్నో మాట్లాడి తన యింటికి వచ్చెను. ఆమె యిట్లస్తమానము ఆలోచనా నిమగ్నయగుటచే ప్రకాశరావామెను ఎగతాళి జేయుచూ ఆమె ఓడిపోవునను నిశ్చయముతో నుండెను.

సీతయ్య విచారణరేపను దినమున రాజ్యలక్ష్మి ప్రకాశరావును కూర్చుండబెట్టి శకుంతల డైరీని చూపెట్టి యందలి విషయములన్నియు విస్తరించి చెప్పెను. ప్రకాష్ ఆమె మాటలు నమ్మక అడ్డదిడ్డములుగా

ప్రశ్నలు వేయసాగెను. రాజ్యలక్ష్మి అన్నియువివరించి, సరియగు సమాధానములుచెప్పి హంతకుడెవరో చెప్పెను. ప్రకాష్ అన్ని విషయములు వినినపిదప రాజ్యలక్ష్మి అపారమేధస్సునకు ఆశ్చర్య నిమగ్నుడై అత్యంత సంతసమున 'రాజ్యం! నీవే గెల్చావు. మరి స్త్రీలు శక్తిస్వరూపిణులుగాదూ?' అని నవ్వెను. ఆ సమయమున వారింటిముందు యొక వ్యక్తి అటు, నిటు తారట్లాడుచుండెను. రాజ్యం తటాలున ఆ వ్యక్తిని చూపెట్టి ప్రకాశరావునకు శకుంతలా హంతకుడీతడేయని చెప్పెను. ఆ వ్యక్తి ఎవరో ప్రకాష్ సులువుగా పోల్చుకొనెను. ఇద్దరునూ ఆ విషయమునే చాలసేపు ప్రసంగించుకొనిరి.

ఆ మరుసటి దినముననే ప్రకాష్ వారంటుతో, సంకెళ్ళతో, రక్షక భటులతో నారాయణరావుగారి గృహమునకేగెను. నారాయణరావుగారు ప్రకాష్‌ను కూర్చుండమనిచెప్పిరి. కుశలప్రశ్నల యనంతరము ప్రకాష్ 'రాజారావెక్కడ'ని ప్రశ్నించెను. ఆయనయు 'మేడమీదయున్నాడు కాబోలు. శకుంతల హత్య యనంతరము నుండియు వానిమనస్సు సరిగాలేదు.' అనుచూ 'రాజా! రాజా!' అని మేడ వైపు దృష్టినిల్పి పిలచెను. వెంటనే 'ఎందుకు మామయ్యా!' అనుచూ రాజారావు క్రిందకువచ్చెను. ప్రకాష్‌ని చూడగనే రాజారావతి వినయముతో ప్రభాతవందన మాచరించి తానునూ యొక కుర్చీమీద కూర్చుండెను. ప్రకాష్ అతనిముఖకవళికలు, ప్రవర్తన, జాగ్రత్తగా పరిశీలించుచూ 'రాజారావు! శకుంతల హత్యనాటినుండియు నీ మనస్సు సరిగాలేదుకదూ! పాపం ఎంత చిక్కిపోయావు?' అనెను. రాజారావా మాటల కులిక్కిపడెను. మోము వెలవెలపోయెను. ధైర్యము చిక్కబట్టి 'అయ్యా! ఆ మాట నిజమే! మా శకుంతలా హంతకుడు సీతయ్యయని మీరు తెలుసుకున్నారుగా. అహా! ధనమెంతపనియైనను జేయు గదా! సీతయ్యను మేమంతా ఎల్లా ప్రేమించేవారమో మీకుగూడా తెలుసు. ప్రక్కలో పాముండగా తెలుసుకోనలేకపోయ్యాము. నిజంగా మీబుద్ధి కుశలత పొగడ నెవరితరము?' అని ఎంతయో విచారముతో పలికెను. నారాయణగారును పుత్రికా మరణము జ్ఞాపకమురాగా కళ్ళనీళ్ళు పెట్టుకొనిరి. ప్రకాష్ యిది చూచి వారితో 'మీరిద్దరూ యిట్లేడ్చుచున్న నేను వచ్చినపని ఏమగును? నేను చేయవలసినపని అయిన తర్వాత అన్ని విషయములు చూచుకొందమని గంభీరముగా' పల్కెను. అంత నారాయణగారు 'మీరువచ్చిన పనియేమ'ని యడిగిరి. వెంటనే యతడు తనచేతనున్న వారంటుచూపి, తన చేతనున్న యీలను వేసెను. వెంటనే నలువురు రక్షకభటులువచ్చి రాజారావు చేతులకు సంకెళ్ళు దగిల్చిరి. రాజారావతి భయముతో 'అ అ అ అయ్యా! యియిదేమి?' అనుచూ వారి బారినుండి తప్పించుకొని పారిపోవజూచెను. కాని యది యసాధ్యమయ్యెను. నారాయణగారి కిదంతయు అయోమయముగానుండి, ఏమియూతోచక నిర్ఘాంత పడి చూచుచుండిరి. ఈ గందరగోళమునకు లోనున్న రుక్మిణమ్మగారు వెలుపలికొచ్చి తన పుత్రునికాంచి 'రాజా! అదేమిరా!' అనుచూ ఏడ్వదొడగెను. అంత నందరినీ సమాధానపరచుటకై ప్రకాశరావు 'అయ్యా! శకుంతలా హత్యా నేరమున రాజారావునుపట్టి బంధించుచుంటిని. మీరెవరూ యిప్పుడింకెట్టి ప్రశ్నలు వేయరాదు. ఇది ప్రభుత్వం ఆజ్ఞ' అనెను. వెంటనే నారాయణగారు 'ప్రకాశరావుగారూ! ఇదెక్కడయినాతగునా! ఏరికోరి పెండ్లాడదలచిన మా శకుంతలను రాజారావెందులకుహత్యయొనర్చును? ఆ సీతయ్యే యీ పనిజేసి మా రాజా మీద పెట్టినట్లున్నది. రాజా నిరపరాధి' అని యింకేమో యనబోవుచుండగా ప్రకాష్ అధికార స్వరమున "అయ్యా! నేడు 11 గం॥లకు న్యాయస్థానమునందంతయు తేలగలదు." యని పోలీసు స్టేషన్‌కు దారితీసెను.

(సశేషము)

'రాజ్యం ప్రతిభ'

శ్రీమతి దే. జయలక్ష్మి

(గత సంచిక తరువాయి)

ఆ నాడే విచారణ దినము. శకుంతల హత్యవిషయమై యేమిజరుగునోయని ప్రజలందరూ తండోపతండములుగావచ్చి న్యాయస్థానము నాక్రమించిరి. న్యాయసభయంతయు జనసముదాయముతో క్రిక్కిరిసి యుండెను. అందరూ నెప్పుడెప్పుడు పదునొకండు గంటలగునాయని ఎదురుచూచుచుండిరి. ఇంతలో 11 గం॥లయ్యెను. అందరూ నతికుతూహలముతో డిటెక్టివ్ ఆఫీసర్ గారి రాకకొరకెదురుచూచుచుండిరి. ఇంతలో వుచితరీతి ముస్తాబయి ప్రకాశరావు న్యాయస్థానమున కొచ్చెను. న్యాయాధిపతి, యితర న్యాయవాదులందరూ కూర్చుండిరి. నారాయణరావు, రుక్మిణమ్మ మొదలగు సాక్షులందరూకూడావచ్చిరి. అంత విచారణ ప్రారంభము చేయుకాలమయ్యెను.

న్యాయాధిపతప్పుడు నలుగురు రక్షక భటులను సీతయ్యా, రాజారావులను తోడ్కొని రమ్మనమని యానతిచ్చెను. రక్షకభటులు వారిరువురనూ సభలో ప్రవేశపెట్టిరి. అప్పుడు న్యాయాధిపతి యీ క్రింది రీతిలో ప్రకాష్‌ను ప్రశ్నింపదొడగెను.

న్యాయాధిపతి:-ప్రకాశరావుగారూ ! ఈ యిద్దరిలో అపరాధి ఎవ్వరు? నిరపరాధి ఎవ్వరు?

ప్రకాశరావు:-రాజారావే యపరాధి సీతయ్యే నిరపరాధి.

న్యాయాధిపతి:-సరే ! ఈతడే హంతకుడనుటకేమి ఆధారములుకలవు ?

ప్రకాష్:-అంతయూ తర్వాత చెప్పెదను. సీతయ్య నిర్దోషి. ముందాతనిని విడిపింపుడు.

న్యాయాధి:-ప్రకాష్‌గారూ ! విడిపించుట కెంతసేపు పట్టును ? ఈతడు హంతకుడనుట కనేక నిదర్శనములుకలవు. కరవస్త్రమాతని యజమానురాలిదే. బాకుమీదితని పేరుకలదు.

ప్రకాష్:- న్యాయాధిపా ! కరవస్త్రము శకుంతలదే. రాజారావు దానిని తీసికొని, సీతయ్యబాకునుకాజేసి యీపనిజేసి నేరము సీతయ్యమీద నారోపించెను. నేనును మొదట యీ విధముగా అనగా మీ అభిప్రాయముగా పొరబడితిని.

న్యాయాధి:-సరే ! హత్యకుగల ముఖ్యోద్దేశమేమి ? ధనమా ?

ప్రకాష్:-కాదు. ధనమేమాత్రమూ కాదు. అయ్యా ! వినుడు. "ఈతడు శకుంతలను ప్రేమించి పెండ్లాడదలచెను. శకుంతలయు నీతని నదేవిధముగా ప్రేమించినది. కాని క్రమముగా నీతడు జూదరి, త్రాగుబోతు, వ్యభిచారియని తెలిసుకొని నీతని ప్రేమను నిరాకరించెను. క్రమముగా నీతనిని దూషింపదొడగెను. కాని యీతడామెను మాత్రము ప్రేమించుట మానలేదు. బలవంతముగనైనను తానీమెను వివాహమాడదలచెను. సామ, దాన, భేద, దండోపాయములచే యీ కార్యము నెరవేర్చుకొనజూచెను. కాని దానికామె లొంగలేదు. అందుచే నీతడీకృత్య మొనర్చినాడు. నేను ప్రబల సాక్ష్యముచే రుజువు

చేయుదును. ఏం రాజారావూ! నేను వచించిన దంతయూ సత్యమేగదా?" అనెను. అంత రాజారావొక విషపు నవ్వుతో "అయ్యా! మీరీ కల్పితకథ నెట్లల్లితిరి?" అనెను. ప్రకాశ్ అతికోపముతో "ఛీ! స్త్రీ హత్యాపాతకా! ఇంకా వేషాలు వేస్తున్నావా? ఒప్పుకొనెదవా? లేదా?" అనెను. రాజారావు "సాక్ష్యమేది? ప్రబల సాక్ష్యమున్న యెడల నేను చేసినను, చేయకపోయినను యొప్పుకొందును."

ప్రకాశరావు:-శకుంతలే జెప్పినది ఆనాటి సంగతంతయు.

రాజారావు:-"ఏమీ దయ్యమై యొచ్చినదా? లేక కల్లో చెప్పిందా" అని నవ్వెను.

ప్రకాశరావు:-దయ్యమైగాదు. దైనికూపములో వచ్చినది, అని వెంటనే "న్యాయాధిపతితో మీరీ దినచర్య పుస్తకము చూడుడు. ఆ నాడు జరిగిన యాపద్విషయములను శకుంతల యొక యక్షరమయినను పొల్లుపోకుండా నిందుపొందుపరచినదని" యా పుస్తకమును న్యాయాధిపతి చేతికిచ్చెను. ఆయనయు దాని నత్యాదరముతో నందుకొనిరి. రాజారావత్యంత ఆశ్చర్య భయములతో యావంక జూచుచుండెను. అందరూ ఆ వంకనే ఆశ్చర్యముతో చూచుచుండిరి. అప్పుడా సమయమున న్యాయాధిపతి యందరికీ వినబడునట్లా దినచర్య పుస్తకము నిట్లు చదవసాగెను.

"నేను నేడును మామూలుగనే యుదయమున లేచి కాలకృత్యములు తీర్చుకొంటిని. పదిగంటలగు నప్పటికి మా నాన్నగారు, అత్తయ్య, బావ యందరును హాలులో కూర్చుండి యుండిరి. నేనుగూడ నచ్చటికి వచ్చి యొక సోఫాపై కూర్చుంటిని. మా నాన్నగారు నాతో 'అమ్మా శకూ! మీ రుక్మిణమ్మత్తయ్య నిన్ను తన కోడలిగా జేసికొనవలెనని కోరుచున్నది. ఏమంటావ్?' అనిరి. నేనునూ నవ్వుచూ "నాన్నగారూ! ఇప్పుడు మాత్రము కోడలిని గాదూ?" అంటిని. నాన్నగారు "అది కాదమ్మా! నీవు విద్యావతివి. రాజా నీకన్ని విధముల తగినవాడు. నేను, అత్తయ్య పెద్దవాండ్లమైతిమిగదా! త్వరగా మీ పెండ్లి జూడవలయునని మా కోర్కె. మీ యిద్దరి అభిప్రాయముల ప్రకారమే మేము జేయుదుము. పోనీ రాజా నీవు చెప్పుముందు, శకుంతలను పెళ్ళాడుట నీకిష్టమేగదా" అనిరి. రాజారావు "మామయ్యా! నేను శకూను తప్ప యింకెవరిని పెళ్ళాడుతాను?" అనెను. మా నాన్నగారు 'అమ్మా! బావ నిన్ను తప్ప యింకెవరినీ చేసికోడట. చెప్పుమరి నీ అభిప్రాయం?' అనిరి. నేను 'నాన్నగారూ! మరి మీ యిష్టమేమిటి?' నాన్నగారు "అమ్మా! నీ యిష్టమే నా యిష్టము. నీ కనిష్టమైన కార్యము లేవియు, నేనెన్నడును చేయను." అనిరి. అంత నేను "నాన్నగారూ! నేను దుష్టులను, జూదరులను, వ్యభిచారులను పెండ్లాడదలచలేదు. వారిని వివాహమాడినచో జీవితమంతయు దుఃఖపూరితము - దానికన్న బ్రహ్మచారిణిగా నుండుటయే యుత్తమము. నేను యతనిని పూర్వము వివాహమాడదలచితిని. కాని యాతని ప్రవర్తన యిప్పుడిప్పుడే నాకు తెలియుచున్నది. మీరేమో ఈతడు చాల సుగుణవంతుడని తలచుచున్నారు. ముమ్మందు నీతడింకా దురాత్ముడగును. నేనిట్లనుట మీకందరకూ కష్టమేమో? నా మనస్సులోనున్న యుద్దేశము మీకందరకీ తెలియవలెననియే యీ విధముగా పల్కితిని. ఆపిమ్మట మీ యిష్టము" అంటిని. అదివిని మా అత్తయ్య, నాన్నగారు నిశ్చేష్టులైరి. రాజారావు మాత్రమతి కోపముతో "శకుంతలా! నన్ను వివాహమాడ నీకిష్టము లేనిచో 'లేదు' యని మాత్రమే చెప్పుము. కాని యీ అనవసర అధిక ప్రసంగమంతా దేనికి? ఎవరో దుష్టులు నీకు నామీద లేనిపోని నేరములన్నియు చెప్పారు. కానిమ్మ"ని యాతడు చివాలున లేచిపోయెను. నేనును లేచి నాగది కెళ్ళితిని. ఉదయము జరిగిన విషయములివియే.

సాయంకాలము ఐదుగంటలకు రాజారావు నేను మేడమీదయుండగావచ్చి 'శకుంతలా! ప్రొద్దున నిన్ను కోపముతో చాల చాల, మాటలన్నాను. నన్ను వివాహమాడ నీకిష్టమేనా' అన్నాడు. వెంటనే నేను "లేదు ముమ్మాటికీలేదు. నీ ప్రవర్తన మారినచో నిన్నుతప్ప యింకెవరినీ వివాహమాడను" అంటిని. అతడమిత కోపముతో "నీమీద నాకెంత ప్రేమకలదో తెలుసుకో. నీయీమాటలవలన నెంత కోపమొచ్చి నదోచూడు. నిన్ను చంపియైనను నీమీద నాకుగల కోపము తీర్చుకొందును. ఏమనదెవు?" అన్నాడు. "ఏమనుట కేమున్నదండీ బావగారూ! రేపీమాటలన్నియు నాన్నతోచెప్పి నిన్ను కారాగారమునకు పంపుటకు ప్రయత్నించెద"నంటిని. అతడు నావంక గుడ్లురిమి చూచుచు "ఆ! జైలుకి పంపుతావుగా? చూస్తాను. నీవు నన్నుతప్ప యింకెవరినీ పెండ్లాడలేవు. బాగా ఆలోచించు. ఇవాళరాత్రి 10 గం॥లకు నీవే సంగతీ నాకు తెలియజేయుము. ఈ మాట ముమ్మాటికీ సత్యము." అని క్రిందకు వెళ్ళిపోయెను. "నేనును యతని మాటల కర్థమేమాయని యాలోచించుచు యచ్చటనే కూర్చుంటిని. ఇంతలో అత్తయ్య అన్నానికి పిలవగా క్రిందకు వెళ్ళితిని. అన్నముకాగానే నాగదికొచ్చి నిద్రపోవలెననుకుంటూ ఈ డైరీలో నేడు వ్రాయవలసిన ముఖ్యాంశములన్నీ వ్రాసితిని. నాకడుపులో చేయిపెట్టి కలచినట్లున్నది. కారణమేమి?" ఇక నిద్ర పోవుదును.

ఇట్లు,
'శకుంతలాదేవి'

అని న్యాయాధిపతి యా దినచర్య పుస్తకమును చదువగా నందరూ నాశ్చర్య భరితులైరి. అంత ఆయన నారాయణగారిని, రుక్మిణమ్మగారిని యీ విషయములగురించి సాక్ష్యమడిగిరి. వారును ఉదయము జరిగినదంతయు యదార్థమనియు, సాయంకాలపు సంగతి తామెరుగమనీ, సత్యముకానిచో యామె యెందులకు వ్రాయుననియు యనిరి. అప్పుడు న్యాయాధిపతి "రాజారావు! ఇంకనూ యొప్పుకొందువా? లేదా?" అనిరి.

అంత రాజారావు తలవంచుకొని "ఇంకనూ ఎందుల కొప్పుకొనను. అంతయు ఆమె తెలిపినదికదా! మిగిలినది నేను జెప్పెదను వినుడు. ఆ రోజు సీతయ్య కత్తిని అతని యింట్లో దొంగిలించితిని. చేతిగుడ్డ శకుంతలదే. బల్లమీదయుండగా తీసితిని. దానిమీద మత్తుమందు జల్లితిని. అంత రాత్రి పదిగంటలకు యింట్లో యందరూ నిద్రించుచుండగా యీ రెండు వస్తువులు తీసికొని శకుంతలగదికి వెళ్ళితిని. శకుంతల కప్పుడే నిద్రపట్టినట్లున్నది. నేనామె నిద్రను చూడలేకపోతిని. అతిక్రోధమున నామెను లేపితిని. ఆమె భయపడుచూలేచెను. వెంటనే నేను 'శకుంతలా! ఈ నాచేతిలోయున్న కత్తినిచూచి మరీ జవాబు చెప్పుము. నన్ను పెళ్ళిచేసికొంటావా! లేదా?' అంటిని. ఆమె యతి ధైర్యముతో "లేదు" యన్నది. నేను మరల "శకూ! ఆలోచించు నీ ప్రాణములపై యాశలేదా?" అంటిని. ఆమె "సరే! పెండ్లిజేసి కొనెదను వెళ్ళుము" అన్నది. కాని నాకనుమానముగాయుండి "సరే! యీ కాగితముమీద వ్రాయుము. నిన్ను కాపాడుదునంటిని. ఆమె ససేమిరా యందుల కొప్పుకొనలేదు. నేను నాచేతిగుడ్డ నామెపై విసరితిని. ఆమె అచేతయై పడిపోయెను. నేనామెను చంపదలచలేదు. బెదరించవలెననుకొంటిని. అందులకామె యొప్పుకోలేదు. మరియును యీ విషయాలన్నీ మా మామకు చెప్పునేమోయను భయముచే 'బాకు'ను

ఆమె హృదయమునందు గృచ్చితిని. ఒక్క వ్రేటుకే యామె తన ప్రాణములను కోల్పోయెను. నేనును మెల్లగా ఆ కరవస్త్ర మాదిగాగల వస్తువులన్నియు నచ్చటనేవిడచి కాళ్ళు చేతులు కడుగుకొని, నాగదిలోనికెళ్ళవలయునని మెల్లగా తలచుచు నడచుచుంటిని. దాదాపు మూడుగంటలయ్యెను. దారిలో సీతయ్య పడుకున్నాడు. నేనతని కాలిమీద పొరబాటున కాలువేసితిని. వెంటనే యతడు బిగ్గరగా "ఎవరున్నారు?" అన్నాడు. "నేనే సీతయ్యా! వాకిట్లోకివచ్చి వెళ్తున్నాను. చూడక నీ కాలిమీద అడుగుపడినది" అంటిని. అంత నతను 'అయ్యా! మీరేనా! ఇందాక శకుంతలమ్మ గదిలో యేదో చప్పుడయినది. మీకేమైనా వినిపించినదా?" అన్నాడు. నేనును "ఎబ్బే! ఏమీ వినపడలేదు. అయినా చూద్దామురా!" యని, మేమిద్దరమూ శకుంతల గదిలోనికి వెళ్ళితిమి. ఆఘోర దృశ్యము కాంచగనే యాతడతి భయముతో అమ్మను, మామయ్యను లేపెను. ఆ పిమ్మట జరిగిన విషయము మీ కందరికీ తెలియును. ఇప్పుడు నేను చాల విచారించుచున్నాను. నేనే హంతకుడను. మీరేశిక్ష విధించినను యనుభవించుటకు సిద్ధముగా నున్నాను" అని తన వాఙ్మూలము పూర్తి జేసెను. అదివిని ప్రజలందరు నాశ్చర్యభరితులైరి. న్యాయాధిపతి అందరికీ అంతయూ వివరించి తీర్పుజెప్పి హంతకున కురిశిక్ష విధించెను. ప్రకాశరావు నందరునూ చాల అభినందించిరి. మరునాడే రహస్య భేదము గావించిన "శ్రీ శ్రీ శ్రీ డిటెక్టివ్ ఆఫీసర్ ప్రకాశరావు"ను పత్రికలన్నియు శ్లాఘించుచు ఆయన కీర్తి ప్రశంసించిరి. నిర్దోషియైన సీతయ్యను విడుదలచేసి యందరు నతనిని క్షమాపణ కోరిరి. నారాయణగారు, రుక్మిణమ్మగారు 'పాముకు పాలుబోసి నట్లాయెగదా?' యని విచారించి, ప్రకాశరావుకు 116 లిచ్చి సత్కరించిరి.

ప్రకాశరావత్యంత సంతసమున 116 రూ||లతో యింటికొచ్చెను. రాజ్యలక్ష్మియు యాతనికొరకెదురు చూచుచుండి యఖండ స్వాగతమిచ్చెను. రాజ్యలక్ష్మి ప్రకాశరావుతో "ఏమండీ మీరుగెలిచారా? నేనుగెలిచానా"? అనెను. ప్రకాష్ నవ్వుచు "నీవేగెల్చావు. జయలక్ష్మి ఎప్పటికైనా రాజ్యలక్ష్మినే వరించును కాని ప్రకాశరావును వరించదుగా. కానీ పత్రికలన్నియు నన్నే పొగడుచున్నవి. ఇంద యీ 116రూ|| లు నీవే తీసుకో." అనెను. రాజ్యలక్ష్మియు "వారు అత్యంత ప్రేమతో మీకిచ్చినవి నాకెందుకులెండి పోనీ మీకిష్టముంటే యందులో వందరూపాయిలు నాకివ్వండి. నిర్దోషిని దోషీయన్నందుకు పదహారు రూపాయలు మీరు తీసుకోండి." అని వందరూపాయలు తీసికొనెను.

అంత ప్రకాశరావు "రాజ్యం! నీమూలాననిర్దోషిని శిక్షించిన పాపం నాకు కలగకుండా పోయింది. నాకువచ్చు అపకీర్తికూడా నీ గొప్పతనముచే, నీ తెలివిచే తప్పిపోయింది. నీ వాడైరీని సంపాదించకున్న నేనెట్లు హంతకుని పట్టుకొందును? నీ బుద్ధి కుశలతను పొగడుటెట్లో నాకు తెలియకున్నది. అర్ధాంగివన్న, ఆదర్శగృహలక్ష్మివన్న నీవేకదా? ఇకనుండీ నీ సలహాతీసికొనకుండా నేనే నేరస్తులనూ పట్టుకోనను. ఇదేనా ప్రతిజ్ఞ" అని అతడు తన ధర్మపత్నియైన "రాజ్యంప్రతిభ" ను అతి ప్రేమతో ప్రశంసించెను.

సోదరీమణులారా! ఇదంతా నిజంగా 'రాజ్యలక్ష్మి ప్రతిభే'. కాని నలుగురిలో ఆ కీర్తి మొగవాడైన ప్రకాశరావునకే దక్కింది.

మరి! "అపరాధ పరిశోధక శాఖలో ఆడవాళ్ళకు మాత్రం యుద్యోగాలెందు కియకూడదు"?

—(:o:)—